
# సీతామాలక్ష్మి

కె. ప్రవీణరెడ్డి

పేపరు తిరగేస్తున్న సీమ కళ్ళు ఆనందంతో ఒక్కసారి మెరిసాయి. ఆమె పదే పదే ఆ రోజు పేపర్లో వచ్చిన తన ఫోటోను చూసుకుంటోంది. స్పెగటీ టాప్, డెనిమ్ స్కర్ట్‌లో ఉందామె ఆ ఫోటోలో. అర కొరగా ఉన్న ఆ బిగుతైన దుస్తులు శరీరాన్ని దాచలేకపోతున్నాయి. నలుపు రంగు టాప్‌లో నునుపైన ఆమె చర్మం గులాబీ రంగులో మెరిసిపోతోంది. ''చార్మింగ్ లేడీ 'సీమ' త్రూ ఎ పార్టీ లాస్ట్ నైట్'' అని ఫోటో కింద రాసిన కాప్షన్‌ని చదువుకొని మురిసిపోతూ మళ్ళీ తదేకంగా ఫోటో వంక చూస్తుండి పోయింది. ఇంతలో ఫోన్ రింగయ్యింది. కార్డ్‌లెస్ పక్కనే ఉన్నా లేపడానికి కాస్త జాప్యం చేసింది. ''హలో సీమా కంగ్రాట్స్'' అన్నది అవతలి కంఠం.



‘‘ఎందుకో’’ అని అడిగింది ఏమీ తెలియనట్లుగా.

‘‘అదేంటీ, ఇంకా పేపర్ చూడలేదా నువ్వు నీ ఫోటో వచ్చిందిగా పార్టీ గురించి కూడా బాగా కవర్ చేశారు. పేజ్‌త్రీలో ఇలా రావడం గొప్ప విషయమే కదా..! ఈ శుభసందర్భంలో పెద్ద పార్టీ ఇవ్వాల్సిందే. మర్చిపోకుండా మమ్మల్నందర్నీ పిలవాలి.’’ అన్నది.

‘‘నేను తరువాత మాట్లాడతాను సెల్ రింగవుతూంది’’ అంటూనే లైన్ కట్ చేసి సెల్ చేతిలోకి తీసుకుంది సీమ.

‘‘హలో సీమా కంగ్రాట్స్, ఫోటోలో భలే బావున్నావు మాంఛి ట్రీట్ ఇవ్వాలి నువ్వు...’’

‘‘థాంక్స్... ‘‘అంటూండగానే ల్యాండ్ లైన్‌కు మరో కాల్... అలా చాలాసేపు ఫోన్‌లూ, మెసేజ్‌లూ వస్తూనే ఉన్నాయి.

సీమ కళ్ళల్లో ఏదో సాధించానన్న గర్వం తొణికిసలాడుతూంది. ఆమె హుషారుగా అలా ఫోన్ మాట్లాడుతూ, మెసేజ్‌లకు రిప్లయ్ పంపిస్తూ ఉంటే కొడుకు రోహన్, కూతురు నిఖిల్ అక్కడే సోఫాలో మౌనంగా కూర్చొని ఆమెనలా చూస్తూండిపోయారు. ఇలాంటి దృశ్యం ఆ ఇంట్లో తరచుగా కనిపిస్తూనే పిల్లలిద్దరూ బిక్కచచ్చినట్లుగా మొహాలు పెట్టుక్కూర్చుంటారు. ఆమె భర్త సంజీవ్ ఏమీ మాట్లాడకుండా ఎలాంటి భావాలూ వెల్లడించకుండా ఓ ఋషిలా ఉండిపోతాడు. ఈ ఫోన్ల పరంపర రెండ్రోజులు నడుస్తుంది. ఆ ఉత్సాహంలో మరో పార్టీ ఏర్పాట్లు మొదలవుతాయి. తనకిష్టం లేకపోయినా మరబొమ్మలా ఆ విందులో పాల్గొంటాడు. తానేం చెప్పినా భార్య వినే స్థితిలో లేదని తెలుసు. కాకపోతే ఆమె కోరికలు తీర్చడానికి తన దగ్గర కావల్సినంత డబ్బు ఉంది. ఆ ఒక్క విషయంలో దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. ఆమె తనని పెళ్ళాడాలనుకోవడానికి కారణం ఆ డబ్బే అని గ్రహించిన అతను ఆ చట్రంలోనే పడిపోయాడు. అతని కళ్ళముందు పెళ్ళినాటి రోజులు కదిలాయి.

***

సంజీవ్ పెళ్ళి చూపులకి వైజాగ్ వెళ్ళాడు. అమ్మకి కాన్సర్ అని డాక్టర్లు చెప్పాక ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి తన చేతుల మీదుగా చెయ్యాలని తాపత్రయపడిందావిడ. సంజీవ్ బి.కాంతో చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టి ఉక్కు వ్యాపారంలోకి దిగాడు. వ్యాపారం లాభాల బాటలోనే నడుస్తుంది. చేతిలో బాగా డబ్బు ఆడుతూంది. ఇంకొన్నాళ్ళు బ్రహ్మచారిగా ఉండాలని ఉన్నా అమ్మ కోరిక కాదనలేక పోయాడు. నాన్నగారు అమ్మకి తోడుగా ఉంటాననడంతో ఒంటరిగానే బయలుదేరాడు పెళ్ళిచూపులకు. నాన్నగారి స్నేహితులింట్లో దిగాడు. ఈ సంబంధం గురించి చెప్పిందీ ఆయనే. వాళ్ళ పక్కింటి అమ్మాయేనట. ఒద్దికైన పిల్ల మంచి కుటుంబీకులు పెద్దగా కట్నం ఇవ్వలేరు గానీ ఒకప్పుడు బాగా బతికిన వాళ్ళు అని చెప్పారాయన. సంజీవ్ మధ్యాహ్నం మూడు గంటల ఫ్లైట్‌లో వైజాగ్ చేరుకున్నాడు. రేపుదయాన పెళ్ళిచూపులు. ఉబుసుపోక ఆ సాయంత్రం బీచ్ వైపు వెళ్ళాడు. చల్లని గాలులు శరీరానికి సోకుతుంటే అలా సముద్రపు ఒడ్డున నడుస్తూ రేపు జరగబోయే పెళ్ళిచూపుల ఊహల్లో తేలిపోతున్నాడు. అమ్మాయెలా ఉంటుందో...? ‘‘నాకు భయంగా ఉందే... నాన్నగారేమంటారో, ఏం రభస అవుతుందో...’’ ఎవరో అమ్మాయి కంఠం వినబడింది. అటు వైపు చూశాడు. కాస్త ఎత్తుగా ఉన్న ఇసుక తిన్నెపై కూర్చొని ఉన్నారిద్దరమ్మాయిలు.


‘‘ఆ అబ్బాయిక్కడికి బయల్దేరక ముందే ఈ విషయం నాన్నగారికి చెప్పాల్సింది..’’ అంటూంది మరో అమ్మాయి.






## మొరాయించిన బెలూన్

జగపతి అన్నపూర్ణా కంబైన్స్ రామకృష్ణులు చిత్రానికి ఆరోజుల్లో అంటే 1978లో 40 లక్షలు ఖర్చయితే అంతా వామ్మో అన్నారు. జనవరి 20 ఆరంభమై, ఏప్రిల్ 21న పూర్తయ్యింది నిర్మాణం. సరిగ్గా 90 రోజుల్లో 32 కాల్‌షీట్లతో. వీటిల్లో అక్కనేని, నందమూరి కలిసి పనిచేసిన కాల్‌షీట్లు ఇరవై ఐదున్నర. క్లైమాక్స్‌లో బెలూన్ ఫైటింగ్ వుంది నాయకులు, సత్య నారాయణకు. బెలూన్‌కే 50 వేలు ఖర్చయ్యింది. అక్కినేని, నందమూరి, సత్యనారాయణల బరువు ప్రకారం ఆ బెలూన్ తయారు చేయించారు. అయితే, మొదటి రోజు అది ఎగరలేదు. ఏమయ్యిందని విచారిస్తే ఈ ముగ్గురూ కాన్వాస్ బూట్లు వేసుకున్నారుట. ఆ బరువు మొదట తీసుకున్న లెక్కల్లో జత కాలేదు మరి. నౌబత్‌పహాడ్ మీద వేసిన రివాల్వింగ్ సెట్టులో ఆ సినిమా క్లైమాక్స్ చిత్రీకరణ జరిగింది.





''నాకిప్పుడే పెళ్ళొద్దని నాన్నగారితో చెబుతూనే ఉన్నాను. ఎవర్నయినా ప్రేమిస్తున్నావా అడిగారాయన. లేదన్నాను. మరైతే ఇంకేం ఇంత మంచి సంబంధం అకారణంగా పోగొట్టుకోవడం తెలివిమాలిన పని అన్నారాయన. నాన్నగారికి మెల్లగా నచ్చజెబుదాం అనుకునేసరికే ఆయన నాకు చెప్పకుండా ఈ పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారు. ఆ అబ్బాయిక్కడికి చేరాకే నాకు విషయం చెప్పారాయన...''

''నీ మనసులో ఎవరూ లేకుంటే లక్షణమైన ఈ సంబంధం కాదనడం ఎందుకు, ఒప్పుకోవచ్చుగా'' అన్నది మరో అమ్మాయి.

''నా సమస్య ఎవరూ అర్థం చేసుకోలేరు. నేను ఎం.ఎ సైకాలజీలో మొన్నే కదా చేరాను. ఆ అబ్బాయి బి.కాంతో చదువాపి బిజినెస్ చేస్తున్నాడు.

రెండు చేతులా డబ్బు సంపాదిస్తున్నాడు. చదువాపాడని అతని పట్ల నాకేం చులకన భావంలేదు. కానీ అతన్ని పెళ్ళి చేసుకుంటే నా చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వస్తుంది. మరో విషయం వాళ్ళ అమ్మగారికి ఆరోగ్యం బాగాలేదట. ఆ ఇంటి కోడలిగా ఆవిడని చూసుకోవాల్సిన బాధ్యత నాపై పడుతుంది. నేనందుకేమీ వెనకాడను. కానీ ఎమ్మే పూర్తయ్యాక హైస్కూలు టీచరుగా జాబ్ చేయాలనే కోరిక ఉంది. ఈ పెళ్లి చేసుకుంటే ఆ కోర్కెకు సమాధి కట్టినట్లే...''

ఆ మాటలు వింటున్న స్నేహితురాలు ఫకాల్న నవ్వుతూ ''ఏంటీ ఇంత మంచి సంబంధం కాలదన్నుకొని నువ్వు పంతులమ్మవాలనుకుంటున్నావా..! బతకలేక బడిపంతులన్న మాట వినలేదా నువ్వు... అదీకాక హైస్కూలు స్టూడెంట్స్‌కి చదువు చెప్పడం అనేదెంత బండ చాకిరీయో నీకు తెలియదా...?

''అలా చులకనగా మాట్లాడకు సీతామహాలక్ష్మీ... అందరూ అలా అనుకొని ఉంటే మనకు చదువు చెప్పడానికి ఎవరూ మిగిలి ఉండేవాళ్ళు కాదు తెలుసా..! మనకింత చదువు అబ్బిందంటే అది టీచర్ల చలవే కదా! లెక్కలు చెప్పే మాధు మేడమ్‌ని గుర్తు తెచ్చుకో.. ఎంత సహనం చూపేవారావిడ. ఆ స్ఫూర్తితోనే నేనిది ఎంచుకున్నాను. ముఖ్యంగా టీన్స్‌లో పిల్లల స్వభావం విచిత్రంగా ఉంటుంది. ఆ వయసులో వాళ్ళను చక్కగా తీర్చిదిద్ది మంచి భవిష్యత్తు ఇవ్వడంలో ఎంత ఆనందం, తృప్తీ ఉంటాయో తెలుసా... నేను ఎం.ఎ సైకాలజీ కూడా అందుకే ఎంచుకున్నాను... కలల్లో తేలిపోతున్నట్లుగా మాట్లాడుతుందామె.

''తల్లీ, నివాళీ!.. నీ సేవాతత్పరతకు కోటి దణ్ణాలు., ... కాస్త ఇక్కడితో నీ కలల వెల్లువకు అడ్డుకట్ట వేసి ఈ విషయం మీ నాన్నగారి చెవిన ఎలా వేస్తావో ఆలోచించు. నిన్ను చూడడానికి విచ్చేసిన ఆ అబ్బాయికెలా నచ్చజెపుతారో..? పాపం, పూర్‌ఫెలో... నాకిలాంటి అబ్బాయి తారసపడితే బుద్ధిగా పెళ్ళి చేసుకొని సెటిలైపోయేదాన్ని... సర్లే... నా కలల విషయం ఇక్కడ అప్రస్తుతం... చీకటి పడుతూంది పద వెళ్దాం'' అంటూ ఆ అమ్మాయి లేచింది.

వాళ్ళ మాటలు విన్న సంజీవ్‌కి విషయం అర్థమయ్యింది. తాను చూడాలని వచ్చిన నివాళికి ఈ పెళ్ళి ఇష్టం లేదని... ఇప్పుడెలా? ఇది కుదరలేదని అమ్మతో ఎలా చెప్పాలి? మరో సంబంధం చూసేసరికి ఆవిడ ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుందేమో..! నివాళితో ఉన్న మరో అమ్మాయి సీతామహాలక్ష్మి మాటలు చెవిలో తిరిగాయి. ''అలాంటబ్బాయి తారసపడితే బుద్ధిగా పెళ్ళిచేసుకొని సెటిలయ్యేదాన్ని'' ఆ మాటలు మననం చేసుకుంటూ వెనక్కి తిరిగి ఆ అమ్మాయి వంక చూశాడు. బావుంది. అనుకున్నాడు. ఇంటికి వెళ్ళి అంకుల్‌తో విషయం చెప్పాడు. సీతామహాలక్ష్మి గురించి వాకబు చేశారాయన. ఆ అమ్మాయి వాళ్ళది శ్రీకాకుళం దగ్గర ఓ పల్లెటూరు. నాన్నగారు వ్యవసాయం చేస్తుంటారు. సీతామహాలక్ష్మిని వైజాగ్‌లో హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. వైజాగ్‌లో ఉండే నివాళితో స్నేహం కుదిరిందా అమ్మాయికి. డిగ్రీ పూర్తయ్యాక సీతామహాలక్ష్మి అక్కడితో చదువాపి ఊరెళ్ళింది. నాన్నగారు సంబంధాలు చూస్తున్నారు. సంక్రాంతి పండక్కి కొత్త దుస్తులు కొనుక్కోవడానికి వైజాగ్ వచ్చి నివాళి ఇంట్లో ఉంటూంది ప్పుడు.

సంజీవ్‌కి సీతా మహాలక్ష్మితో పెళ్ళి కుదిరింది. వారంలో పెళ్ళి జరిగిపోయింది. ఇంట్లో ముచ్చటగా తిరుగుతూన్న కొడుకూ కోడల్ని చూసుకొని మురిసిపోయింది అమ్మ. ఏడాది తిరక్కముందే ఆ దంపతులకు కలిగిన కవలలను చూసి తృప్తిగా కన్ను మూసింది.

***

సీతామహాలక్ష్మి అడుగుపెట్టిన వేళా విశేషమేమోగానీ సంజీవ్ బిజినెస్ మరింత బాగా పుంజుకుంది. కుప్పలు తెప్పలుగా డబ్బు వచ్చి పడుతూంది. అతి త్వరలోనే ఆ నగరంలో బాగా డబ్బున్న వాళ్ళ జాబితాలో చేరిపోయాడు. సీతామహాలక్ష్మి పేరు సీమగా మార్చుకుంది. పేరుతో బాటు స్టైలూ మారింది. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులకు వెళ్ళింది. శరీరాకృతిని తీరుగా మార్చుకోవడానికి జిమ్‌లకు వెళ్తూంది. పేరు మోసిన క్లబ్‌లన్నిట్లోనూ మెంబర్‌షిప్‌లు తీసుకుంది. సిటీలో జరిగే ప్రతి ఫ్యాషన్ షోలకీ వెళ్తుంది. బాగా డబ్బూ, పరపతీ, ఉన్న వాళ్ళ కిట్టీ పార్టీల్లో పాల్గొనే స్థాయికి ఎదగడానికి బోలెడు కృషి చేసి సఫలమైంది. ఆమె ఈ విధంగా విషయం తీరిక లేకుండా ఉంటే పిల్లలిద్దరూ ఆయా పోషణలో పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. ఆమె తనలో ఏం చూసి పెళ్ళాడిందో గ్రహించిన సంజీవ్ తానిక ఆ చట్రంలోనే బిగుసుకు పోవాల్సి వచ్చింది.

''సంజూ ఈ ఫోటో బాగా వచ్చింది కదూ...! సీమ మాటలతో ఆలోచనలు పారద్రోల్తూ అవుననట్లుగా తల పంకించి దిన చర్యలో పడ్డాడు.

***

సీమ హెల్త్ క్లబ్‌కు వెళ్ళడానికి రెడీ అవుతూంది. ఇంతలో ఆయా వచ్చింది ''అమ్మాయిగారివ్వాళ స్కూలుకు వెళ్ళనంటున్నారు. కడుపు నెప్పిగా ఉందట. టిఫిన్ కూడా చేయకుండా పడుకున్నారు'' అని చెప్పింది.

నిఖిత గదిలోకి వెళ్ళింది సీమ

బోర్లా పడుకొని ఉంది నిఖిత

''ఇలా మాటి మాటికీ స్కూలుకెళ్ళడం మానేస్తే ఎట్లా... అసలే టెన్త్‌క్లాస్... త్వరలోనే బోర్డ్ ఎగ్జామ్స్ ఉన్నాయి. డాక్టరుకు ఫోన్ చేసి నెప్పి తగ్గడానికి మందడుగుతాను. ఏదీ..! ఇటు తిరుగు నెప్పి ఎక్కడ వస్తుందో చూస్తాను..'' అన్నది నంబరు డయల్ చేస్తూ.

''ఉహూ నేనీ రోజు స్కూలుకు వెళ్ళను. నాకింట్లోనే బావుంది'' అన్నది నిఖిత.

''ఈ కాస్త నొప్పికే మానేస్తే ఎలా..?'' అవతలివైపు ఫోన్ తీసిన శబ్దం వినిపిస్తూంది.

''హలో డాక్టరుగారూ నేను సీమను మాట్లాడు



తున్నాను. పాపకి మళ్ళీ కడుపునెప్పిగా ఉంది తగ్గడానికేదైనా.. టాబ్లెట్ చెబితే...''

''అలా పేషెంట్‌ని పరీక్షించకుండా మాటిమాటికీ మందులివ్వడం సరైన పద్ధతి కాదు. క్లినిక్‌కి తీసుకురండి చూస్తాను'' అన్నాడు డాక్టరు.

***

నిఖితను పరీక్ష చేసి కొన్ని ప్రశ్నలడిగాడు డాక్టరు. తర్వాత సీమతో విడిగా మాట్లాడాడు. ''నిజానికి అమ్మాయికి జబ్బేం లేదండీ.. స్కూలుకు వెళ్ళాలనిపించక అలా ప్రవర్తిస్తుంది... స్కూల్లో ఆమెకు నచ్చని విషయమేదైనా ఉందేమో కనుక్కోండి...''

స్కూల్లో నిఖితకు నచ్చని విషయం ఏమై ఉంటుంది..., అసహనంగా అనుకుంది సీమ. స్కూలు వాతావరణం, సహవిద్యార్థులు, టీచర్లు అన్నీ సక్రమంగానే ఉన్నాయి.. నిఖితకు చదువుకోవాలని లేదా..? ఏమోమరి.. ఈ మధ్య ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో మార్కులు తగ్గాయి. మంచి ట్యూషన్ పెట్టించాలనే అనుకుంటూంది. బాగా చెప్పే టీచర్ కోసం వాకబు చేస్తూనే ఉంది. ఈ మధ్య నిఖిత ప్రవర్తనలో మార్పు గమనించింది. చలాకీతనం తగ్గింది. అబద్ధాలు చెబుతూంది. ఉన్నట్టుండి కడుపునెప్పిగా ఉంది అంటూంది. స్కూలు టైమ్ దాటగానే మామూలుగా అవుతుంది. అది ఉత్తుత్తి నొప్పే అని తనకూ తెలుసు. ఎందుకిలా చేస్తూంది.. ఓ రోజు స్కూలుకు వెళ్ళి విషయమేమిటో కనుక్కోవాలి అనుకుంటూ వాచీ వంక చూసింది. బోర్డ్ మీటింగ్‌కి టైమ్ అవుతూంది. క్లినిక్ నుంచి ఇంటికి చేరగానే నిఖితను స్కూలు యూనిఫాం వేసుకోమంది. డ్రైవరు స్కూల్లో దింపి వస్తాడని చెప్పింది.

''ఊహూ నేను వెళ్ళను మమ్మీ ఇంకా నెప్పి తగ్గలేదు..'' అన్నది.

''నొప్పీ లేదూ ఏం లేదు. స్కూలు కెళ్ళాల్సిందే..'' కాస్త కటువుగా అన్నది సీమ.

''నేను వెళ్ళను'' మొండిగా అన్నది నిఖిత.

''ఎందుకే... ఎందుకిలా చేస్తున్నావ్''

''.......''

''చెప్పవే ఏమైందసలు అక్కడెవరన్నా నిన్ను భయపెడుతున్నారా..''

''ఊహూ''

''మరి...

...సంశయిస్తూనే చెప్పింది నిఖిత ''మమ్మీ పేపర్లో అలా నీ ఫోటోలు వచ్చిన రోజు నాకు స్కూలుకు వెళ్ళాలనిపించదు. నా ఫ్రెండ్సంతా ఏదోలా మాట్లాడతారు. మీ మామ్ నీ కంటే చిన్నమ్మాయిలా డ్రెస్ అవుతుందని అదోలా నవ్వుతారు... నాకదేం నచ్చదు...''

కూతురి మాటలు తుపాకీ గుళ్ళలా తగిలాయి సీమకి. ఒక్క క్షణం మ్రాన్పడిపోయింది. ఇంతలో ఆమె సెల్ రింగయ్యింది. హెల్త్‌క్లబ్ నుంచి ఫిట్‌నెస్ ట్రెయినర్ అడుగుతూంది– ''మేడమ్ మీ అప్పాయింట్‌మెంట్ టైమ్ దాటిపోయింది... వేరే వాళ్ళు వెయిట్ చేస్తున్నారు...''

''.. ఓ ఐయామ్ సారీ. నేనీ రోజు కాస్త బిజీగా ఉన్నాను రావట్లేదు, యూ క్యారీ ఆన్'' అని చెప్పింది. నిఖితకి టిఫిన్ పెట్టమని ఆయాకి పురమాయించి తన గదిలోకి వెళ్ళింది. ఒంటిపై నున్న ట్రాక్ సూట్ మార్చుకొని బోర్డ్ మీటింగుకి రెడీ అయ్యింది. యాంత్రికంగా పనులు చేసుకుపోతున్నా కూతురి మాటలు ఆమెలో ఆలోచనలు రేకెత్తిస్తూనే ఉన్నాయి... ఆలోచిస్తూనే మీటింగుకి బయల్దేరింది.

***

మీటింగ్ మధ్యలో ఉండగా సెల్ రింగయ్యింది. కాలర్ ఐ.డి.లో స్కూలు నంబరు చూసి ఫోన్ కాల్ తీసుకుంది.

''హలో సీతామహాలక్ష్మీ.. నేను..'' అవతలి నుంచి నివాళి కంఠం వింటూనే చిరాగ్గా ''నేను మీటింగులో ఉన్నాను..'' అన్నది.

''రోహన్ గురించి చెప్పాలి...'' అన్నది నివాళి.

''స్కూలుకు వచ్చాడుగా...''

''అవును వచ్చాడు.. కానీ... తోటి పిల్లలతో గొడవ పడ్డాడు. గాయాలయ్యాయి... కంగారేమీ లేదు. ఫస్ట్ ఎయిడ్ చేసి సిక్ రూంలో ఉంచాము.''

ఆ మాటలు విన్న సీమ స్కూలుకు బయల్దేరింది. స్కూలుకు చేరేసరికి అక్కడ సందడిగా ఉంది. స్టాఫ్ రూం ముందు చాలా మంది తల్లిదండ్రులు ఉన్నారు. వాళ్ళంతా మాట్లాడుకుంటున్నారు. నివాళిగారికి బెస్ట్ టీచర్‌గా ప్రెసిడెంట్ అవార్డు వచ్చిందట. శుభాకాంక్షలు తెలుపుదామని వచ్చాను. అంటూంది ఒకావిడ. నేనూ అందుకే వచ్చాను ఈ రోజు డ్రైవరు రాలేదు పాపని తీసికెళ్ళడానికెటూ రావాలి అలాగే ఆవిడని స్వయంగా గ్రీట్ చేద్దామని వచ్చాను అంటున్నాడో విద్యార్థిని తండ్రి. అక్కడందరూ నివాళిని ఆకాశానికెత్తేస్తున్నారు. ''రియల్లీ షి ఈజ్ ఎ గ్రేట్ లేడీ, మా అబ్బాయికి ఎగ్జామినేషన్ ఫియర్ బాగా ఉండేది. ఆ భయంతో నేర్చుకున్నది కూడా మర్చిపోయి సరిగ్గా రాయలేకపోయేవాడు. కౌన్సిలింగ్‌తో ఆ భయాన్ని పోగొట్టారావిడ. ఇప్పుడు బాబు అన్ని సబ్జెక్ట్లలోనూ మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు.''

''మా పాపకి ఓ విచిత్రమైన అలవాటుండేది. నాలుగు వేళ్ళూ ఒకేసారి నోట్లో పెట్టుకొని పీలుస్తూ ఉండేది. మంచి మాటతో చెప్పి చూశాను, బెదిరించి చూశాను. డాక్టర్ల దగ్గరికి తీసుకువెళ్ళాను. ఆఖరికి నివాళిగారి వల్లే నా కూతురు ఆ అలవాటు మానింది.'' అందరి మాటలూ వింటూన్న సీమలో క్షణం పాటు నివాళి పట్ల అసూయ పొడ చూపింది. ఆ.. పంతులమ్మతో తనకేం పోలిక... ఈసడింపుగా తలతిప్పుకుంది. నివాళిని కలవడానికి స్టాఫ్ రూంలోకి ఒకరి తరువాత ఒకరు వెళ్ళి వస్తున్నారు. క్యూలో ఇంకా ఐదారుగురు ఉన్నారు. తాను లోపలికి వెళ్ళడానికి కనీసం అరగంటన్నా పడుతుంది. వాచీ వంక చూసుకుంది. నాలుగు దాటింది. రేపు మిసెస్ శ్రీపతిరావుగారి పెద్ద కర్మ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతూంది. ఆ సందర్భంలో తాను వేసుకోవడానికి ఆర్డర్ చేసిన దుస్తులు సిద్ధంగా ఉన్నాయని డ్రెస్ డిజైనర్ ఫోన్ చేసింది. ఆవిడ ఐదింటి వరకే షాపులో ఉంటుంది. ఆమె అక్కడ ఉండగానే తాను ట్రయల్ చేస్తే ఏమన్నా మార్పులు అవసరమయితే చేయించి ఇస్తుంది. లోగడ ఎం.పి. రాఘవులు పోయినప్పుడు తెల్లని లక్నో దుస్తుల్లో మెరిసిపోతోన్న ఆ లలితాదేవినే అందరూ కళ్ళప్పగించి చూస్తూండి పోయారు. ఆ తరువాత ఆవిడ కట్టుకున్న ఆ లక్నో ఎంబ్రాయిడరీ చీర ఎక్కడ కొన్నానని చాల మంది అడిగి తెలుసుకున్నారట. ఈసారి తనూ అంత ప్రత్యేకంగా కనిపించాలి...



# ఫలించని కమలాకర కల

కమలాకర కామేశ్వరరావు చనిపోవడానికి ముందు మూడు సినిమాలకు స్క్రిప్టు సిద్ధం చేసి పెట్టుకున్నారు. అవి రంగనాథ వైభవం, మహిషాసుర మర్దని, కృష్ణ కుచేల. కానీ, తీయకుండానే కన్నుమూశారు. రంగనాథ వైభవం చిత్రానికి రచయిత చిల్లర భావనారాయణరావు. మిగతా రెండు చిత్రాలకు సముద్రాల జూనియర్ రచయిత. కుచేల సినిమా రామాంజనేయులు అనే నిర్మాత తీదామనుకున్నారు. ఆయనకేమో అక్కినేని చేత కుచేలుడి వేషం వేయించాలని. కానీ అక్కినేని అప్పట్లో ఆ వేషం చేయనన్నారు. కొద్దికాలం ఆగితే చేస్తానన్నారు. వీటిల్లో మహిషాసుర మర్దనికి పెండ్యాల సంగీత దర్శకుడుగా నిర్ణయమయ్యారు. మిగతా రెంటికీ సాలూరి సంగీతం. కామేశ్వరరావు మాదిరే తమిళంలో పౌరాణికాలకు ఎ. పి. నాగరాజన్ ప్రసిద్ధి. ఆయన మరణించాక అక్కడ పౌరాణికాలకు దర్శకుడంటూ లేకుండా పోయాడు. దానితో కమలాకరను వాళ్లు తమకో చిత్రం తీసిపెట్టమన్నారు. ఆ చిత్రం మీనాక్షి తిరువిళైయాడల్. కె. ఆర్. విజయ, శివాజీ గణేశన్ ముఖ్య పాత్రధారులు.కానీ, అదీ కార్యరూపం దాల్చకుండానే వెళ్లిపోయారాయన.

''హాయ్ సీమా నువ్వూ నివాళిని గ్రీట్ చేద్దామనే వచ్చావా'' స్నేహితురాలి పలకరింపుతో ఆలోచనల్ని పారద్రోలింది.

''..ఊ'' అన్నది ఏం చెప్పాలో తోచక.

''నివాళి భర్త నవీన్‌గారు పరిశోధనలో ఓ కొత్త ఫార్ములా కనిపెట్టారట తెలుసా... డ్రగ్స్ బారిన పడ్డ వాళ్ళని ట్రీట్ చేయడానికి బాగా పనికొస్తుందట... నిజంగా ఇది చాలా గొప్ప విషయం కదా... లక్కీ కపుల్ ఒకేసారి ఇద్దరికీ అవార్డులు రావడం.. '' ఆమె చెప్పుకు పోతూంది.

ఇంతలో సీమ వంతు రావడంతో లోపలికి వెళ్ళింది. నివాళితో ఏం మాట్లాడాలో కూడా తోచ లేదు. కనీసం పలకరించలేకపోయింది. నివాళి ఆమెను కూర్చోమని చెప్పి కాలింగ్ బెల్ నొక్కింది. ప్యూన్ వచ్చాడు. మేడంని సిక్ రూంకి తీసుకెళ్ళు... అని సీమతో నువ్వు రోహన్ దగ్గరకు వెళ్ళు నేను కాసేపట్లో వస్తాను'' అన్నది. సీమ వెళ్ళేసరికి రోహన్ మంచి నిద్రలో ఉన్నాడు. నుదుటికి చిన్న గాయమైనట్లుంది. బ్యాండేడ్ వేసి ఉంది. కాళ్ళూ చేతులూ అక్కడక్కడా గీరుకు పోయాయి. వాడినలా చూసేసరికి ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎందుకు వాళ్ళతో తలపడ్డాడు... ఆమె ఆలోచిస్తున్నంతలో నివాళి రానే వచ్చింది.

''ఏం జరిగింది...'' సీమ కంఠం వింటూనే రోహన్ కళ్ళు తెరిచాడు. ''మమ్మీ ఇక్కడికెందుకు వచ్చారు..? ఆమె రాక పట్ల అయిష్టం వ్యక్తమవుతూంది, వాడి కంఠంలో.

''రోహన్ మమ్మీతో ఇంటికివెళ్ళు. రేపట్నించీ ఎప్పటిలాగే స్కూలుకి రావాలి. నేను చెప్పింది గుర్తుందిగా'' అన్నది నివాళి.

అలాగేనన్నట్లుగా తలవూపాడు.

''సీమా విషయమేమిటో తర్వాత మాట్లాడుకుందాం. ఇంతకు ముందే నిఖితకు ఫోన్ చేశాను. అట్లా స్కూలు మానేయాల్సిన అవసరం లేదనీ రేపట్నించి ఎప్పట్లా రావాలనీ చెప్పాను. నువ్వేం వర్రీ అవకు నేను చూసుకుంటాను'' అన్నది నివాళి.

సీమకు విషయమేమిటో కాస్త కాస్తగా అర్థమవుతూంది. ఇంటికి వెళ్తూనే రోహన్ తన గదిలోకి వెళ్ళబోయాడు.

''స్కూల్లో ఏం జరిగింది రోహన్, ఎందుకు పోట్లాడావు'' అడిగింది .

''ఏం.. ఏం లేదు మమ్మీ, ఊరికేనే... మళ్ళీ ఎప్పుడూ ఇట్లా చేయను''

అన్నాడు తలవంచుకొని.

''అసలేం జరిగింది?''

''....''

వాడు చెప్పడని అర్థమయ్యింది. ఇంకా రెట్టించి పని వాళ్ళ ముందు రాద్ధాంతం చేయడం ఇష్టంలేక తన గదిలోకి వెళ్ళింది. ఆ సాయంత్రం ఆమెటూ వెళ్ళాలన్పించలేదు. పిల్లల ప్రవర్తన ఆమెలో అలజడి కలిగించింది. స్నానం చేసి కాఫీ కలపమని వంటావిడకి చెప్పి పిల్లల గదివైపు వెళ్ళింది. గది తలుపు దగ్గరా వేసి ఉంది. లోపల్నించి లీలగా మాటలు విన్పిస్తున్నాయి.

''ఇంట్లో ఉండిపోయిన నీ పనే హాయిగా ఉంది. పాఠాలు మిస్సవుతానని స్కూలుకు వెళ్ళిన నేను నీరజ్ గాడితో గొడవపడాల్సి వచ్చింది. వాళ్ళింట్లో వాళ్ళు మమ్మీ ఫోటోల గురించి ఏదోగా మాట్లాడుకున్నారని వాడు పవన్‌తో చెబుతూంటే ఒళ్ళు మండి ఒక్కటి వేశాను. ''మీ మమ్మీ అలా ఫోటోలు దిగి పేపర్లో వేయించుకోగా లేనిది మేం మాట్లాడితే తప్పేంటి..? అన్నాడు. నేను వాడిని మరో రెండు వేశాను. అందరూ వాడినే సపోర్ట్ చేశారు. గొడవ జరిగింది.'' రోహన్ మాటలు వింటున్న సీమ మొహం వివర్ణమైంది. నెమ్మదిగా అక్కడ్నించి కదలగానే ఫోన్ మోగింది.

***

పేజ్ త్రీ ఇన్‌చార్జ్ ఆ పత్రిక ఆఫీసు నుంచి మాట్లాడుతోంది. ''కంగ్రాట్స్ మేడమ్, మీ ఫోటోకి మంచి రెస్పాన్స్ వచ్చింది.'' – సీమ మళ్ళీ అదే టాపిక్ చిరాకుగా అనిపించినా, అన్యమనస్కంగానే ''థాంక్స్'' అన్నది. ''మేడమ్, మేము ఒక ప్రపోజల్ అనుకున్నాం. మీరు నెలలో మూడు వారాలు పేజి త్రీలో రకరకాల గెటప్స్‌లో కనిపిస్తే, అది యూత్‌ని బాగా ఆకర్షిస్తుంది. మీరు ఫార్మల్‌గా ఓకె అంటే ఒక పోష్ పబ్ వాళ్ళు స్పాన్సర్ చేస్తామన్నారు. మేడమ్, మీ డ్రెసెస్ కూడా రెండు పెద్ద షోరూమ్స్..'' సీమ ఫోన్ కట్‌చేసింది. తను లోకానికి ఎలా కనిపిస్తోందో, వాళ్ళంతా తన చిన్న యిష్టాన్ని ఎలా ప్రయోగించుకోవాలనుకుంటున్నారో అర్థమైంది. మళ్ళీ ఫోన్. వేరే నెంబరు. ఈవెంట్ ఎక్సిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. సీమ అసహనాన్ని, రోషాన్ని అణచిపెట్టి ''చూడండి, యిలాంటి వాటికి అదే వృత్తిగా తీసుకుని ప్రొఫెషనల్‌గా వుండేవారున్నారు కదా. ప్లీజ్ నన్ను వదిలెయ్యండి'' అంటున్న ఆమె మాట పూర్తి కాకుండానే ''లేదు మేడమ్ వాళ్ళని యిట్టే గుర్తుపడతారు. దాని వల్ల మాకు అంత క్రెడిబిలిటీ రాదు.'' అని విచిత్రంగా నవ్వాడు. ఎంతైనా క్రోటన్ మొక్కకీ, విరబూసిన ముద్దబంతికీ తేడా లేదంటారా...'' అన్నాడు. సీమ ఆ మాటలకు షాక్ తిన్నది. ఫోన్ కట్ చేసింది. ఆలోచనలో పడింది. ఇందులో తన తప్పు ఎంత, వారి అవకాశవాదమెంత అని సీమ మనసులో కూడా తర్కించదలచలేదు. ''స్వేచ్ఛ''కి కూడా నియమావళి వుంటుందనీ, అందునా తనలాంటి ఒక గృహిణికి మరిన్ని హద్దులు, వద్దనుకున్నా వుండి తీరతాయని అర్థమైంది. తానిప్పుడు కుటుంబ సభ్యురాలు. నేను, నా యిష్టం అనుకోడానికి చాలా అడ్డంకులు వుంటాయి. తను చేసింది తప్పు కాకపోవచ్చు. అయినా పిల్లలు నా కారణంగా చిన్నబుచ్చుకోవడం, నా సరదాని ఎవరో తమ వ్యాపారానికి వాడుకోవాలనుకోవడం – జరిగింది తలుచుకుంటే వుక్రోషం, దు:ఖం పెల్లుబికాయి సీమలో.

ఆ రోజుటి పేపర్లో ప్రెసిడెంట్ అవార్డుకి ఎన్నికైన నివాళి, నవీన్‌ల ఫోటోలు వచ్చాయి. తెలుపు, నలుపుల కలనేత చీరతో మెళ్ళో సన్నని ముత్యాల పేరుతో సింపుల్‌గా ఉంది ఆమె. చిరునవ్వుతో కాంతివంతంగా వెలిగిపోతోందా ముఖం. ఏ డిజైనర్ దుస్తులూ, ఖరీదైన నగలూ ఇవ్వలేనంతటి ఆకర్షణ ఆ స్వచ్ఛమైన చిరునవ్వు తెచ్చిపెట్టిందామెకు. చూస్తున్న పేపరు పక్కనపెట్టి హెల్త్ క్లబ్‌కి బయల్దేరింది సీమ. ఆమె వెళ్ళేసరికి మాటల్లో మునిగి ఉన్న వాళ్ళంతా సీమ రాకని గమనించలేదు.

''నివాళి ఫోటో చాలా చక్కగా ఉంది కదా...!''

''ఔను, నేను ఇందాకే ఫోన్ చేసి నివాళితో అదే మాట చెప్పాను. అవార్డు పొందిన శుభ సందర్భంగా గ్రాండ్‌గా పార్టీ ఏర్పాటు చేస్తున్నావా! అని అడిగాను.''

''ఈ ఆదివారం వృద్ధాశ్రమంలో లంచ్ ఏర్పాటు చేశాననీ, వాళ్ళకు కొత్త దుస్తులు తీసుకెళ్తున్నాననీ చెప్పింది. మీరంతా అక్కడికే వస్తే సంతోషిస్తాను అన్నది. మనమంతా వెళ్దామా...?''

''తప్పకుండా వెళ్దాం'' ఉత్సాహంగా అన్నారందరూ.

''...ఎట్లా ఆ రోజు సీమ టౌన్‌డొనింగ్‌లో లంచ్ ఏర్పాటు చేస్తానంది...''

''ఆ... అలాంటి పార్టీలు ఎప్పుడూ ఉండేవే... ఇలాంటి అవకాశం వచ్చింది. అందులో పాలు పంచుకుంటే మనమూ ఓ మంచి పని చేస్తున్నామనే తృప్తి ఉంటుంది కదా యిటే వెళ్దాం..''

''ఈ మధ్య సీమ మరీ క్రేజీగా ప్రవర్తిస్తూంది. పేజ్ త్రీ పిచ్చి పట్టుకుంది. ఆమెకు తోడుగా సంజీవ్ అంతలా సహకరించడం ఏమిటి? మావారైతే ఒప్పుకోరు. పైగా సంజీవ్ గురించేమంటారో తెలుసా...? బఫూన్‌లా తయారై ఆవిడ వెనక తిరుగు... ఏకధాటిగా చెప్పుకుపోతున్న ఆమె సీమని చూసి ఠక్కున ఆపేసింది. వాళ్ళ మాటలకు సీమ మనసు చిన్నబోయింది కానీ జ్ఞాన చక్షువులు తెరుచుకున్నట్లుగా అన్పించింది. ఏమీ విననట్లుగానే చిరునవ్వుతో అందర్నీ పలకరించి కాసేపుండి వెళ్ళిపోయింది. ముఖప్రీతికో, పబ్బం గడుపుకోవడానికో తననెదురుగా పొగిడే వాళ్ళంతా ఈ రోజు నివాళిని మనసారా అభినందిస్తున్నారు. ఆమె కళ్ళ ముందు నివాళి ముఖం కదలాడింది. నివాళి తన స్నేహితురాలు. ఆనాటి నుండీ తనతో అంతే స్నేహంగా మెలుగుతూంది. తానే ఆమెను చిన్న చూపు చూసేది. నివాళి తన స్నేహితురాలైనందుకు ఈరోజు తానెంతో గర్వపడుతూంది. వీళ్ళందరికీ ఆమె పరిచయస్తురాలు మాత్రమే. కానీ తనకాప్తురాలు. తన పిల్లల మనసులో రేగుతున్న అలజడిని తొలగించే మార్గం ఏమిటో నివాళినే అడగాలి.. అనుకుంటూ నంబర్ డయల్ చేసింది. ''హలో'' అవతలి వైపు నివాళి కంఠం వినిపించింది.

''నేను... సీతామాలక్ష్మిని మాట్లాడుతున్నా...

★